శనగలు ఇచ్చేదెప్పుడు..
పంట సాగు చేసేదెప్పుడో?



నా పేరు వెంకటరమణారెడ్డి. మాది రాజుపాలెం మండలం గాదెగూడూరు గ్రామం. నేను ఈ ఏడాది 20 ఎకరాల్లో శనగ పంట వేసుకునేందుకు ఎకరాలకు రూ. 4 వేలు పెట్టి 20 ఎకరాలకు 80 వేలు పెట్టుబడితో ఎరువులను విత్తుకున్నాను. విత్తనాలన కోసమని నాలుగు రోజుల క్రితం రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. అధికారులేమో విత్తనాల కోసం వెళితే రేపు మాపు అంటున్నారు. ఆలస్యమైతే పదును ఆరిపోతుంది. ఏం చేయాలో అర్థం కాలేదు.



నా పేరు గంగిరెడ్డి. మాది ఎర్రగుంట్ల మండలం మాలెపాడు గ్రామం. మూడు ఎకరాల్లో శనగ పంటను సాగుచేసుకునేందుకు రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుని 4 బ్యాగులకు రూ. 5640 డబ్బులు చెల్లించి రసీదు తీసుకున్నా. కానీ ఇంత వరకు విత్తనాలు ఇవ్వలేదు. పొలంలో పదును ఆరిపోతుంది. అధికారులేమో విత్తనాలు ఇవ్వలేదు. బయట తెచ్చుకుందామంటే ప్రభుత్వ ఇచ్చే విత్తనాలను ఏమి చేసుకోవాలి.

ఇలాంటి వేదన ఈ ఇద్దరు రైతులదే కాదు జిల్లా వ్యాప్తంగా వేలమంది రైతులది. అధికారులేమో డబ్బులు చెల్లిస్తేనే విత్తనాలను చెప్పి డబ్బులు చెల్లించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రైతులేమో అప్పోసప్పో తెచ్చి ఆశపడి విత్తనాల కోసం డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు కట్టించుకుని విత్తనాలను సరఫరా చేయడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు చేతులెత్తేశారు. విత్తనాల సరఫరాలో ఆలస్యం అవుతుండటంతో పదును ఆరిపోతుందని అన్నదాతలు అందోళన చెందుతున్నారు. విత్తనాలు వచ్చిన తరువాత విత్తుకుందామంటే మళ్లీ వర్షం కురుస్తుందో లేదో నన్న ఆందోళన రైతును వేధిస్తోంది.

- సకాలంలో విత్తనాలు సరఫరా చేయడంలో చేతులెత్తేసిన ప్రభుత్వం
- పదును ఆరిపోతుందని ఆందోళనలో అన్నదాతలు
- 72234 క్వింటాళ్లకుగాను ఇప్పటికే 3323.4 క్వింటాళ్లు మాత్రమే రాక
- రిజిస్ట్రేషన్స్‌తో సరి విత్తనాలు ఎప్పుడే మరి
- డబ్బులు కడితేనే విత్తనాలంటున్న అధికారులు
- రేపు మాపు అంటూ కాలం వెళ్లదీసున్న వ్యవసాయ అధికారులు



శనగ విత్తనసాగు కోసం ఎరువులను విత్తుకుంటున్న రైతులు (ఇన్‌సెట్) విత్తనాల కోసం డబ్బులు కట్టించుకున్న రసీదు



కడప అగ్రికల్చర్ : ఖరీఫ్‌సీజన్‌లో సాగు చేసిన ఆరుతడి పంటలు వర్షాభావ పరిస్థితులతో దెబ్బతిని రైతులు నష్టాపోయారు. ముందస్తు రబీకి సంబంధించి శనగ పంటను సాగు చేసుకుందామనుకుంటేనేమో రైతులకు విత్తనాలు అందక ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క రైతులు విత్తనాల కోసం వారి గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ముమ్మరంగా రిజిస్ట్రేషన్‌ను చేసుకుంటున్నారు. గత నెల చివరిలో జిల్లాలో మంచి వర్షాలు కురిశాయి. దీంతో పాటు ప్రస్తుతం కూడా జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. విత్తనం సిద్ధంగా ఉంటే ఈ పదునుకే చాలా మంది రైతులు శనగ విత్తనాన్ని విత్తుకునే వాళ్లు. కానీ ప్రభుత్వం సకాలంలో విత్తనాలను అందించడంలో చేతులెత్తేసింది.

రబీ సీజన్‌లో..

జిల్లాలో ప్రస్తుత రబీసీజన్‌లో శనగ విస్తారంగా సాగు కానుంది. ఈ ఏడాది సాగుకు ముందు వర్షాలు కూడా అనుకూలంగా మారటంతో శనగ సాగుకు సన్నద్ధమతున్నారు. ఏటా జిల్లాలో అత్యధికంగా కమలాపురం, జమ్మలమడుగు, పొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గాల పరిధిలో అత్యధిక విస్తీర్ణంలో శనగపంట సాగవుతోంది. ఇప్పటికే ఆయా మండలాల్లో చాలా మంది రైతులు శనగ పంట సాగుకు ముందు ఎరువులను విత్తుకుని సాగుకు సిద్దంగా ఉన్నారు. జిల్లాలో ఆయా నిజయోకవర్గాల పరిధిలో ఈ ఏడాది 2,05,652 ఎకరాల్లో శనగ పంట సాధారణ సాగు కావాల్సి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాకు 72234 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలను కేటాయించారు. ఇప్పటికి జిల్లాకు 3323 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే వచ్చాయి.

బహిరంగ మార్కెట్‌లో..

జిల్లాలో చాలా మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తనాలను కొనుగోలు చేసుకునేందుకు సిద్ధమతున్నారు. కాకపోతే ఇప్పటికే చాలా మంది తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాలలో విత్తనాల కోసం డబ్బులు చెల్లించారు. పోనీ ఆ విత్తనాల కోసం ఎదురు చూడకుండా బయట కొనుగోలు చేసుకుందామంటే రైతు సేవా కేంద్రాలలో చెల్లించిన డబ్బులు వెనక్కు వస్తాయో రావోనన్న అందోళన. దీంతో పాటు ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే విత్తనాలకు బహిరంగ మార్కెట్‌లో దొరికే విత్తనాలకు రేటు కూడా పెద్ద తేడా లేదు. కొంతమంది రైతులు బయటనే కొనుగోలు చేసుకుంటున్నారు. ఏపీ సీడ్స్ నుంచి విత్తనాలు వచ్చేందుకు కొంత ఆలస్యమతుందని రైతులకు తెలియడంతో వ్యాపారులు బహిరంగ మార్కెట్ ధరలు పెంచి కిలో రూ.76 నుంచి 78 రుపాయలు వసూలు చేస్తున్నారు.

గతేడాది ఈ పాటికే విత్తనం పంపిణీ..

గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి శనగ విత్తనం పంపిణీ చేశారు. కానీ ఈ ఏడాది ఆక్టోబర్ 10వ తేదీ ఒక్క కమలాపురం మండలంలో మాత్రం అరకొరగా పంపిణీ చేశారు. తరువాత 11వ తేదీ సింహాద్రిపురం మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే పంపిణీ చేశారు. మిగతా జిల్లాలో ఎక్కడా పంపిణీ చేయలేదు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాలలో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్‌ను చేసుకుంటున్నారే తప్ప విత్తనాలను అందించలేదు. ఈ విషయై ఏపీ సీడ్స్ మేనేజర్ జగదీష్‌వివరణ కోరగా రైతులు ఇప్పటి వరకు 8800 క్వింటాళ్లకు డబ్బులు చెల్లించారు. ఇప్పటికి 3323.4 క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేశా. మిగతా డబ్బులకు మరో రెండు రోజుల్లో సరపరా చేస్తామని తెలిపారు.

పేదలకు అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: హరూన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌బి.అహ్మద్‌బాషా జన్మదినం సందర్భంగా పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. స్థానిక రామాంజనేయపురంలోని ఖుభ మసీద్ మదరసాలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దాసరి శివ, తోటక్రిష్ణ, వెంకటేష్, బన్నీరెడ్డి, మస్తాన్, సలీమ్‌సాహెబ్ పాల్గొన్నారు. అలాగే 30వ డివిజన్‌లోని జువెనైల్ హోంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మౌలా ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఎండీ.షఫీ, మన్సూర్, గోపి, శివారెడ్డి హాజరయ్యారు.

పోస్టర ఆవిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: యువత డగ్స్ తీసుకోవడంతో వారి భవిష్యత్తు చిత్తు అవుతుందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ముద్రించిన నౌక్రీ దో, నషా నహీ పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం హామీని గాలికి వదిలేసిందన్నారు. దేశ వ్యాప్త కాంపెయిన్‌లో యువత తమ గళం వినిపించి బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. నౌకరీ దో నషా నహీ చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున యువత తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వంశీ యాదవ్, ఆదిశివప్రసాద్, గంధం సునీల్ కుమార్, సాయి, చక్రి పాల్గొన్నారు.



పెండింగ్ బకాయిలు చెల్లించాలి



వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ముస్లింలు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి సీవీ.ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎఫ్ బకాయిలు జమకాక పోవడంతో వడ్డీ నష్టపోతున్నామని తెలిపారు. 2023- 24 సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ వెంటనే ప్రాన్ ఖాతాలో జమ చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఐదేళ్లకోసారి పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర ఉమాకాంత్, వీరప్రసాద్, పద్మజ ,చంద్రోశేఖర్‌రెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు

మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు తగవు

– వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ముస్లింలు ఆందోళన

కడప అర్బన్ : ఉత్తర ప్రదేశ్‌లో ఓ వ్యక్తి మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోను సోషల్ మీడియాలో వారం రోజుల క్రితం పోస్ట్ చేశాడు. ఈ సంఘటనపై శుక్రవారం కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ముస్లింలంతా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలంటూ నినాదాలు చేశారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కడప ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ముస్లిం పెద్దలను పిలిపించి మాట్లాడారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీంతో ముస్లింలు ఆందోళనను విరమించారు.



కేటీఎం డ్యూక్ టీఎఫ్‌టీ 200 మార్కెట్‌లోకి



వాహనం కొనుగోలు చేసిన వ్యక్తికి తాళాలు అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కేటీఎం డ్యూక్ టీఎఫ్‌టీ 200 సీసీ బైక్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా మార్కెట్‌లోకి విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అల్మాస్‌పేటలోని హరూన్ సూపర్ బైక్స్ షోరూంలో నూతన వాహనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ఆధునాతన సౌకర్యాలతో రూపొందించబడిన ఈ బైక్ యువతను విపరీతంగా ఆకర్షిస్తోందన్నారు. అనంతరం మొదటి బైక్‌ను కొనుగోలు చేసిన వినియోగదారుడికి తాళాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

నాపై ఆరోపణలు నిరాధారమైనవి

– ఇంటర్ ఆర్‌జేడీ రవి

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల గత కొద్ది రోజుల నుంచి కొంతమంది విద్యార్థి సంఘాలు తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, ఉన్నతాధికారుల సూచన మేరకే కాంట్రాక్టు లెక్చరర్లను సర్దుబాటు చేశానని ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల పని సర్దుబాటుకు సంబంధించి కేవలం 8 జిల్లాలలో కలిపి 18 మందిని మాత్రమే ఇంటర్ కమిషనర్ సూచనలలో ఖాళీగా ఉన్న వాటిలో పనిసర్దుబాటు చేశానని తెలిపారు. అదికూడా స్పౌజ్, మెడికల్ సంబంధించి కాంట్రాక్టు అధ్యాపకలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నామన్నారు. అది కూడా ఉన్నతాదికారుల ఆదేశాల మేరకే చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో లక్షలు చేతులు మారినట్లు ఆరోపణల చేయడం అన్యాయం అన్నారు. తను ఏ తప్పు చేయలేదన్నారు. ఎలాంటి విచారణకైనా సిద్ధమని తెలిపారు.



పండగ పూటా.. కొనుగోలుదారులకు ధరల దడ



కడప కల్చరల్: విజయదశమి సందర్భంగా మార్కెట్లు రద్దీగా మారాయి. జనంలో పండగ కళ కనిపిస్తోంది. విజయదశమి సందర్భంగా నిర్వహించాల్సిన పూజలు, ఇతర సంప్రదాయ కార్యక్రమాలకు సామగ్రి కొనేందుకు వచ్చిన వారితో మార్కెట్లు రద్దీగా మారాయి. ఇంత వరకూ కేవలం కూరగాయలే భగ్గుమంటున్నాయని బాధ పడిన ప్రజలకు పండగ సీజన్ సందర్భంగా పూల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో కొనాల్సిన అవసరం ఉన్నా.. అర కిలో లేదా పావు కిలోతో సరిపెడుతున్నారు. మంగళవారం సగటున కిలో రూ.80గా ఉన్న పూల ధర శుక్రవారం రూ.450కి పెరిగింది. కొనుగోలుదారులు మరీ అవసరమైతే తప్ప కొనేందుకు ముందుకురావడం లేదు. అరటి పిలకలు, మామిడాకుల ధరలు భగ్గుమంటున్నాయి. గతేడాది జత రూ.10గా ఉన్న అరటి పిలకలు ప్రస్తుతం రూ.40–50గా ఉన్నాయి. మామిడాకుల ధర రూ. 25–50 పలుకుతోంది. అన్ని రకాల పండ్ల ధర కిలో రూ. 60 నుంచి రూ.140కి పైమాటే. కొనుగోలు దారులతో ముఖ్య కూడళ్లలో రద్దీ కనిపించింది.



ఉత్సవాల్లో మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

ఉత్సవాల్లో మేయర్, మాజీ డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గడ్డి బజారు లక్ష్మీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మేయర్ కె.సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెడుపై మంచి గెలిచినందుకు జరుపుకొనే విజయదశమి పండగ రోజున ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సాయిదత్త, జయచంద్రారెడ్డి, మల్లికార్జున, రామ్మోహన్‌రెడ్డి, సఫీ, దాసరి శివ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ దర్శన్ విజయవంతం

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ దర్శన్ కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ నెల 4న 182 మంది బాలలు, 486 మంది బాలికలు, డిప్యూటీ డీఈఓ, 50 మంది గైడ్ టీచర్ల బృందంతో బయలు దేరిన యాత్రను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, డీఈఓ మర్రెడ్డి అనురాధ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం 4న శ్రీకాళహస్తి, 5న శ్రీహరికోట, 6న కొండవీడుకోట, 7న పిఠాపురంలో కుక్కటేశ్వర స్వామి ఆలయం, 8న అన్నవరంలో సత్యనారాయణస్వామి ఆలయం సందర్శించి విశాఖపట్నం చేరుకున్నారు. 9న సింహాచలంలో అప్పన్నను దర్శించి అనంతరం బొర్రా గుహలు చూశారు. 10న అరకులోని కాఫీ తోటలు, ఉద్యానవనాలు, వ్యూ పాయింట్లు సందర్శించి అదే రోజున విజయవాడకు చేరారు. 11న ఉదయం పది గంటలకు కడపకు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల్లో విశిష్టత, ఇతర వివరాలను తెలుసుకున్నామని విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్, డీఈఓలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రక్తదాతకు సత్కారం

కడప ఎడ్యుకేషన్: ఇండియన్ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ 70 సార్లు రక్త దానం చేసిన రక్త దాత శివశంకర్‌రెడ్డిని జెకె జనం కోసం సేవా సాంస్కృతిక క్రీడా విద్యాభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లయన్ జెకె ఖాదర్‌బాషా శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్య వంతులైన యువకులు రక్త దానం చేయడానికి ముందుకు రావాలన్నారు. అబ్దుల్ కరీముల్లా, రేహాన్, పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

వైవీయూ: రక్తదానం చేసేందుకు ఆరోగ్య వంతులైన యువకులు ముందుకురావాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సూర్యనారాయణమూర్తి అన్నారు. కడప నగరం తెలుగుగంగ కాలనీలో నిర్వహిస్తున్న కంబైన్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–8లో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కల్నల్ మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతామన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తం దానం చేయాలని ఆయన కోరారు. అనంతరం పలువురు ఎన్‌సీసీ కేడెట్స్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.